క్లుప్తంగా

వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుంది



నివాళులర్పిస్తున్న సెల్వమణి

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి భరోసా ఇచ్చారు. స్థానిక మేదర వీధికి చెందిన వైఎస్ఆర్ సీపీ యువ నాయకుడు మాబు తండ్రి సలాం(70) సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న సెల్వమణి వారి ఇంటికి వెళ్లి సలాం మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ నాయకులు శంకర్, మాహిన్, షకీలా పాల్గొన్నారు.

సారా తయారీ మహిళపై కేసు నమోదు



ఎస్ఐ ధ్వంసం చేసిన సారాబట్టీ

పాలసముద్రం: మండలంలోని నరసింహాపురం పంచాయతీ ఓటేరు కాలువలో సోమవారం సారా తయారు చేస్తున్న మహిళను అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ నరసింహాపురం సమీపంలోని ఓటేరు కాలువలో పయని భార్య గోవిందమ్మ సారా తయారు చేస్తుండగా ఆమె పట్టుపడ్డారు. వెంటనే ఆమెను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ఇతర సామగ్రిని, సుమారు 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు.

మురగయ్యకు ఘన సన్మానం



మురుగయ్యను సన్మానిస్తున్న వైఎస్ఆర్ సీపీ నేతలు

నగరి: వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రియాశీలక కార్యదర్శిగా నియమితులైన నగరి నియోజకవర్గం కరకంతాపురం నాయకుడు టీసీ మురగయ్యను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల సోషల్ మీడియా కో కన్వీనర్ శివ తన బృందంతో సన్మాన కార్యక్రమం చేపట్టారు. మాజీ మంత్రి ఆర్కే రోజా చలవతోనే తనకు ఈ పదవి దక్కిందని పార్టీ అభివృద్ధి కృషి చేస్తానని మురుగయ్య తెలిపారు. నాయకులు పిజి.క్రిష్ణయ్య, సి.మణి, వినాయకం డి.రమేష్, ఎ.గాంధీ, యం.అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఛిద్రమైన లోతట్టు వంతెన రోడ్డు



దెబ్బతిన్న ఓరూరుకు పోవు రోడ్డు

పల్లె దారులు.. నరకానికి నకళ్లు

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం
- వాహనదారులకు తప్పని తిప్పలు

నగరి: మున్సిపల్, మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడిన దారులే కనిపిస్తున్నాయి. కిలోమీటర్ల మేర దారులు అధ్వానంగా తయారవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అభివృద్ధి లేదు.. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి మేమొస్తే రోడ్ల రూపురేఖలు మార్చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా వారికి రోడ్ల గుంతలు కనిపించడం లేదు. రోడ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించిన కూటమి నేతలు.. అవన్నీ మాటలకే పరిమితమన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలను కూడా చూపడం లేదు. డబ్బుల్లేవు.. గల్లా పెట్టి ఖాళీ అంటూ కొత్త పల్లవి అందుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో అవసరం లేకున్నా ఒకరిద్దరు టీడీపీ నేతలకు లబ్ధి చేకూర్చేందుకు రోడ్లు వేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉంది.

నామమాత్రపు చర్యలు

కీళపట్టు మార్గంలో లోతట్టు వంతెన కొట్టుకుపోతే మట్టివేసి సరిచేశారు. ఆ ప్రాంతాన్ని ప్రజా ప్రతినిధులతో పాటు జిల్లా కలెక్టర్ కూడా పరిశీలించారు. త్వరలో పక్కా రోడ్డు ఈ ప్రాంతంలో నిర్మిస్తామన్నారు. అయితే రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. ఈ మార్గంలో వెళ్లడం ప్రయాణికులకు సాహసంగా మారింది. ముడిపల్లికి వెళ్లే మార్గం ఛిద్రమై అధ్వానంగా ఉంది. ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గం చినుకుపడినా చిత్తడి కావడంతో నడక కూడా నరకప్రాయంగా మారుతోంది. పుత్తూరు మండలం తిరుమలకుప్పంకు వెళ్లే మార్గం రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. ఇక్కడ రోడ్డు నిర్మాణానికి గత ఏడాది అక్టోబరు నెలలో శిలాఫలకం వేశారు. అయితే ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. విజయపురం మండలం ఒరూరుకు, వడమాలపేట ఎస్వీపురానికి, నింద్ర మండలం అత్తూరు ఎస్టీకాలనీ, చవరంబాకం, మిట్టూరు గ్రామాలకు వెళ్లే దారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.

కాలువ పూడ్చి రోడ్డు వేశారు

మండలంలోని తెరణి గ్రామంలో వ్యవసాయ పొలాల మధ్య కాలువ ఉన్న ప్రాంతాన్ని పూడ్చి రూ.4.50 లక్షల అంచనా వ్యయంతో రోడ్డు నిర్మించడంపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొందరు టీడీపీ నేతలకు లబ్ధి చేకూర్చేందుకే ఈ రోడ్డు నిర్మిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తోంది. గత ప్రభుత్వం పూడిపోయిన కాలువను తవ్వి కాలువ ఏర్పాటు చేస్తే ప్రస్తుతం దాన్ని పూడ్చి రోడ్డు వేస్తున్నారు. రెవెన్యూ రికార్డులలో కాలువగా ఉన్న ప్రాంతాన్ని పూడ్చి రోడ్డు వేయడంపై జిల్లా కలెక్టర్‌ను సంప్రదిస్తామని సర్పంచ్ నిర్మలాడింపుల్ తెలిపారు.



తెరణి గ్రామంలో కాలువపై వేస్తున్న రోడ్డు



గుంతలమయంగా ఉన్న ముడిపల్లి రోడ్డు



కీళపట్టు మలుపు వద్ద ఛిద్రమైన రోడ్డు



అధ్వానంగా ఉన్న తిరుమలకుప్పం రోడ్డు

ఘనంగా గోదాదేవికి పూజలు



అలంకరణలో గోదాదేవి

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో సోమవారం స్థానిక వినాయక ఆలయంలో గోదాదేవి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. 20 రోజులు గా గ్రామంలో గోదాదేవికి గ్రామస్తులు పూజలు నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రా మస్తుల ఆధర్యంలో ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామంలో ఉరేగించారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

నగరి: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేటలో సీపీఎం నేతలు, మరమగ్గ కార్మికులు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం పెంచినటువంటి విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ విద్యుత్ బిల్లులను భోగి మంటలో కాల్చి దహనం చేశారు. ఈ సందర్భంగా మరమగ్గ కార్మికుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ మాట్లాడుతూ ఎన్నికలు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని మాటిచ్చి తీరా గెలిచి ముఖ్యమంత్రి అయ్యాక చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచేశారన్నారు. కూటమి ప్రభుత్వం మాట తప్పి విద్యుత్ చార్జీలు పెంచిందని తెలిపారు. దీంతో పేదలపై పెనుభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా తమ వైఖరిని మార్చుకోకపోతే రాబోయే కాలంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జగదీష్, షణ్ముగం, కాలతి, అయ్యప్పన్, ధనపాల్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో భోగి వేడుకలు

వెదురుకుప్పం: మండలవ్యాప్తంగా ప్రజలు భోగి పండుగ జరుపుకున్నారు. పలెల్లో పెద్దఎత్తున భోగి మంటలు వేసి సందడి చేశారు. పిల్లలు, పెద్దలు తెల్లవారుజామునే భోగి మంటలు వేశారు. అనంతరం తలంట్లు పోసుకుని ఆలయాలకు తరలి వెళ్లారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు: ఆనాటి ఆస్నేహం ఆనంద గీతం అంటూ ఇరవై ఏళ్ల క్రితం కలిసి చదువుకొన్న విద్యార్థులు అందరూ మళ్లీ అదే కళాశాలలో కలిసి సందడి చేశారు. సోమవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004–07 మధ్య కాలంలో చదువుకొన్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వేడుకగా జరిగింది. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత కలిసిన మిత్రులు ఆనాటి సంఘటనలను గుర్తు చేసుకొంటూ, ఒకరినొకరు పలకరించుకొన్నారు. అప్పటి విశ్రాంత ప్రిన్సిపల్ ఆర్.రాజేంద్రనాయుడు, అధ్యాపకులు రవివర్మ, ప్రస్తుత కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు నాగయ్యలను సన్మానించారు. పూర్వ విద్యార్థులు శోభన్, హరిప్రసాద్, శ్రీనాథ్, రామచంద్రన్, గోపి, సుబ్రమణ్యం వెంకటేష్ పర్యవేక్షించారు.

ముసురుకున్న మబ్బులు



నగరి పట్టణంలో వర్షపు తుంపర

నగరి: ఎన్నడూ లేని విధంగా భోగి పండుగ రోజు ముసురు పట్టుకుంది. ఉదయాన్నే మబ్బులు కమ్ముకొని తుంపర్లతో వాతావరణం చల్లగా మారిపోయింది. రోడ్డుపై సంక్రాంతి వ్యాపారం కోసం వచ్చిన వీధి వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. వేకువ జామునే వీధుల్లో రంగవల్లికలు వేయాలని ఉత్సాహం చూపినవారికి వర్షం నిరాశను మిగిల్చింది.

ఘనంగా భోగి సంబరాలు

నగరి: పల్లెలు, పట్టణం సోమవారం భోగిపండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా ఇంటి ముందు ముగ్గులపై పెట్టిన గొబ్బెమ్మలతో చేసిన పిడకలు, పాత చాపలు, గంపలు, పారకలు, చాటలు, గోనెసంచులు, కొయ్యలు, అట్టలు పోగు చేసిన మహిళలు వాటిని భోగి మంటల్లో వేసి కాల్చారు. చిన్న పిల్లలు భోగి మంటల చుట్టూ నిలబడి మేళాలు వాయించుకుంటూ చిందులు వేశారు. గ్రామాల్లో భోగి మంటల్లోనే నీరు వేడి చేసుకొని తలంటు స్నానం చేశారు. భోగి మంటల్లో నుంచి దీపం వెలిగించుకొని పూజ గదిలో ఉంచారు. నూతన వస్త్రాలను ధరించి ఆలయాలకు వెళ్లారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా ప్రజలు భోగి పండుగ జరుపుకున్నారు. మహిళలు ఇంటి ముంగిట రంగువల్లులు వేశారు.

విజయపురం: విజయపురం, వడమాలపేట మండలాల్లో భోగి పండుగ ఘనంగా నిర్వహించారు. వాడవాడల భోగి మంటలు కాంతులు విరజిమ్మాయి. తమ కష్టాలను తొలగి పోవాలని ప్రజలు అగ్ని దేవుడిని ప్రార్థించారు. వేకువజాము నుంచే ఇళ్ల ముందు యువతులు, మహిళలు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.



రాచపాలెం వీధుల్లో భోగిమంటలు

నింద్రలో..

నింద్ర: భోగి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం మండలంలోని ప్రజలు భోగి మంటలు వేశారు. పిల్లలు ఉదయం 3 గంటలకే తమ ఇంటి ముందు భోగి మంటలు వేశారు. అనంతరం గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అత్తూరు, అరూరు, అగరం, ఇరుగువాయి గ్రామాల్లో యువకులు భోగి మంటలు వేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలవ్యాప్తంగా ప్రజలు భోగి పండుగ జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట రంగవల్లులు వేశారు. ఎక్కడా పండుగ వాతావరణం కనిపించలేదు.



కార్వేటినగరం: గొబ్బిళ్లు తడుతున్న మహిళలు



కార్వేటినగరం : సాయిబాలాజీ నగర్‌లో భోగిమంటలు వేస్తున్న మహిళలు, యువకులు, చిన్నారులు

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

కార్వేటినగరం: యాదవ ఎంప్లాయిస్ సొసైటీ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మండల శాఖ ఆధ్వర్యంలో కానగలమ్మ ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జువ్వి మోహన్‌మురళీ యాదవ్ మాట్లాడుతూ యాదవ ఉద్యోగులు ఐకమత్యంతో సంఘ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. యాదవుల అభ్యున్నతికి సంఘం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైఈఎస్ సంఘం జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు జోగి గురుమూర్తియాదవ్, నాయకులు కుమారస్వామియాదవ్, అన్నాకుప్పస్వామి యాదవ్, ఎస్ఆర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం ఆరుద్ర దర్శనం



ఏకకాలంలో శివపార్వతులు, వల్లీ దేవసేన సుబ్రమణ్యస్వామి దర్శనం

పుత్తూరు: పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామి అమ్మవార్ల ఆరుద్ర దర్శనం నయనానందకరం జరిగింది. వేకువ జామున స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించి, ఆరుద్ర దర్శన భాగ్యం కల్పించారు. పుత్తూరు గ్రామ పురోహితులు చిట్టమూరు రమేష్ బాబు, ధనలక్ష్మీ దంపతులు ఏటా ధనుర్మాసం పౌర్ణమి రోజున ఆరుద్ర ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. స్వామి, అమ్మవార్లను విశేష అలంకరణలో సప్పరంపై కొలువు దీర్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ పట్టణ పురవీధుల్లో ఊరేగింపు వైభవంగా సాగింది. శివపార్వతుల ఊరేగింపులో అనుకోని విధంగా శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారి ఊరేగింపు కలవడంతో ఆధ్యాత్మికతను ద్విగుణీకృతం చేసింది.

వైభవంగా గోదాదేవి కల్యాణం





కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు , ప్రత్యేక అలంకరణలో గోదాదేవి, శ్రీవెంకటేశ్వరస్వామి

నగరి: టీటీడీకి చెందిన స్థానిక శ్రీకరియమాణిక్య స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. నెల రోజులపాటు గోదాదేవి వ్రతం చేస్తూ తిరుప్పావై ప్రవచనం పఠించిన భక్తులు ధనుర్మాసం ముగింపు రోజున అమ్మవారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. 500 మంది మహిళలు అంజనేయ స్వామి ఆలయం నుంచి పట్టువస్త్రాలను, పండ్లు, పాలను, శివాలయం నుంచి పసుపును ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ పూజల్లో అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజల అనంతరం అమ్మవారి పసుపు, అక్షింతలు ప్రసాదంగా అందజేశారు. తిరుమల దేవస్థానం నుంచి వచ్చిన పండితులు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, శివప్రసాద్ గురూజీ, శ్రీనివాసులు నాయుడు, ప్రధాన అర్చకులు రమేష్ ఆచార్యులు, ధన్వంతరి ఆచార్యులు, ఆలయ అభివృద్ధి సలహా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.